ప్రజాశక్తి
సోమవారం 24, ఏప్రిల్ 2023
5
శ్రీ సత్యసాయి



26న ముఖ్యమంత్రి జిల్లా పర్యటన : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఈనెల 26న ఉంటుందని, ఏర్పాట్లలో ఏలాంటి లోటు రానీయకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎమ్.గౌతమి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన శింగనమల నియోజకవర్గం లోని నార్పల మండల కేంద్రంలో ముఖ్యమంత్రి పాల్గొంటున్న జగనన్న వసతి దీవెన కార్యక్రమం ఖరారైన నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోటు రానీయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులతో పాటు పోలీసు అధికారులతో కూడా సమన్వయం చేసుకోవాలని అనంతపురం ఆర్డీవో మధుసూదన్‌కు సూచించారు.

మెప్మాలో అవినీతి కంపు..!



మెప్మా కార్యాలయం ఎదుట తీర్మానాలను రాసుకుంటున్న మహిళా సంఘాల ప్రతినిధులు

హిందూపురం పులపాలక సంఘంలోని పేదరిక నిర్మూలన సంస్థ విభాగంలో అవినీతి కంపు కొడుతోంది. మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళలు ఆర్‌పి నుంచి సిఒల వరకు ముడుపులు ఇవ్వనిదే సంతకాలు పెట్టడం లేదు. చివరకు ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలని సంకల్పించి ఆసరా పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తే.. ఆ డబ్బులు వారి ఖాతాలో నుంచి తీసుకోవాలన్నా మహిళలు ముడుపులు ఇవ్వాల్సి ఉంది. చివరకు ప్రతి నెలా మహిళలు పొదుపు చేసుకున్న డబ్బులను వారి ఖాతాలో నుంచి తీసుకోవాలనుకున్నప్పటికీ ఆర్ పి, సిఒలు సంతకం పెట్టాల్సిందే. దానికి వారికి ముడుపులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందంటే ఇక్కడ అవినీతి ఎంత పెద్ద ఎత్తున జరుగుతోందో అర్థమవుతుంది.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో ఒక విభాగం అయిన మెప్మాలో అవినీతి రాజ్యమేలుతోంది. పెద్ద ఎత్తున కమీషన్ల పర్వం సాగుతోంది. పొదుపు మహిళలను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రత్యక్షంగా కొందరు ఆర్పీలు వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నప్పటికీ ఆ శాఖలోని అందరికీ వాటాలు అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ పరిధిలో మెప్మా పరంగా మొత్తం 25,550 పొదుపు గ్రూపులు ఉన్నాయి. ఒక్కో సంఘంలో 10 మంది సభ్యులు ఉంటారు. కొన్ని గ్రూపులు కలిపి సమాఖ్యలుగా ఉంటాయి. ఆయా గ్రూపుల సభ్యుల నుంచి ఆర్పీ (రీసోర్స్ పర్సన్)లను ఎన్నుకుంటారు. మొత్తం 81 మంది ఆర్పీలు ఉన్నారు. వీరిని ఐదుగురు సిఒలు (కమ్యూనిటీ ఆర్గనైజర్స్) పర్యవేక్షిస్తున్నారు. మహిళలు రెండు రకాలుగా పొదుపు చేసుకుంటారు. ఈ పొదుపులో నుంచి అవసరం మేరకు ఆ సంఘంలో తీర్మానం చేసుకుని రుణాలు తీసుకుని, వారు ప్రతి నెలా చెల్లిస్తారు. దీనికి సైతం సిఒలు సంతకం పెట్టాలన్న

ముడుపులివ్వందే సంతకాలు పెట్టని వైనం
ప్రక్షాళన చేయకుంటే తిరుగుబాటు తప్పదు

నిబంధనలు పెట్టి మహిళలను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ఆయా సంఘాల వద్దకు వెళ్లి తీర్మానాలను రాయాలన్న నిబంధనలు ఉన్నాయి. అయితే వాటిని సిఒలు తుంగలో తొక్కి నిత్యం మహిళలను మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారు. రంజాన్ మాసంలో ముస్లిం మహిళలు వారి పొదుపు ఖాతాలో నుంచి కాస్త రుణం తీసుకోవాడానికి ఉపవాస దీక్షలో సైతం గంటల తరబడి సిఒల సంతకం కోసం వేచి ఉండాల్సిన పరిస్థితిని హిందూపురంలో చవిచూశారు. అంత సేపు వేచి ఉన్నా వారు సంతకాలు పెడతారన్న భరోసా సైతం ఉండదు. సిఒలు సంతకాలు పెట్టకుండా ఎంతో మందిని తిరిగి వెనక్కు పంపిన సంఘటనలు ఉన్నాయి.

ప్రతి రుణానికి కమీషన్ ముట్టజెప్పాల్సిందే..

ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలని ఆసరా పథకం కింద మూడో సారి ఆయా మహిళా సంఘాలకు నిధులు జమచేసింది. ఈ నిధులు పొదుపు ఖాతా నుంచి సభ్యుల ఖాతాకు బదిలీ చేయడానికి తీర్మానం రాయాలని.. దీనికి ఆర్‌పిలు ఒక తీర్మానానికి రూ.200 తీసుకుంటున్నారు. అంటే హిందూపురం పురపాలక సంఘంలో 1699 సంఘాలకు ఆసరా మంజూరు చేశారు. ఒక సంఘానికి రూ.200లతో రూ.3.39 లక్షలు ఒక్క ఎప్రిల్ నెలలో జరిగింది. దీంతో పాటు ఒక్క పొదుపు సంఘానికి రూ.లక్ష రుణం మంజూరు అయితే సిఒకు రూ.1000 కమిషన్ ఇవ్వాల్సిందే. ఇలా ప్రతి రుణంలోనూ సిఒలకు, ఆర్‌పిలకు కమిషన్లు ముట్ట చెప్పాల్సిందే. లేని పక్షంలో సిఒలు సంతకాలు పెట్టరు.

ఆర్‌పిల ఇష్టారాజ్యం..

ప్రభుత్వపరంగా అమలయ్యే పథకాల ఫలాలను లబ్ధిదారులకు అందేలా చూడాల్సిన బాధ్యత ఆర్‌పిలదే. బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణం మంజూరులో వారు సహాయపడాలి. అలాగే గ్రూపు సభ్యులు తీసుకున్న స్త్రీ నిధి తదితర రుణాలకు సంబంధించి తిరిగి చెల్లింపులు సకాలంలో చేయించాలి. అయితే కొందరు ఆర్పీలు సిఒల సహకారంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రుణాల మంజూరు సమయంలో చేతివాటం చూపుతున్నారు. కమీషన్ల రూపేణా లబ్ధిదారుల నుంచి భారీగా డబ్బు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రూ. లక్ష రుణానికి రూ.1000 చొప్పున కమీషన్ నిర్ణయించి బహిరంగంగానే వసూలు చేస్తున్నారు. బ్యాంకుల చుట్టూ తిరిగి పనులు చేయిస్తున్నాం కదా.. ఖర్చులు ఉంటాయి.. అందుకే కమీషన్ అంటూ లబ్ధిదారుల వద్ద ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. హిందూపురం పురపాలక సంఘంలో 25,550 సంఘాలు ఉన్నాయి. ఇందులో దాదాపు నెలకు 1000 సంఘాలకు పైగా రుణాలను తీసుకుంటారు. ఈ లెక్కన నెలకు రూ.10 లక్షల అవినీతి జరుగుతోంది. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు ఎటువంటి విచారణ చేపట్టక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వసూలు చేసిన సొమ్ములో అందరికీ భాగం ఉండటం వల్లనే మిన్నకుంటున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. దీనిపై పూర్తి విచారణ చేపడితే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది. లేని పక్షంలో మహిళలు ఆర్‌పిలకు, సిఒలకు వ్యతిరేకంగా తిరగబడే అవకాశాలు మెండుగా ఉన్నాయి.



తిమ్మాపురంలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీసీవో ఎన్. బాలాజీ నాయక్

'గురుకులం' ప్రవేశ పరీక్ష ప్రశాంతం

ఐదో తరగతికి 9099 మంది, ఇంటర్మీడియట్‌కు 3583 మంది విద్యార్థులు హాజరు
పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన డీసీవో బాలాజీ నాయక్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో నడుపబడుతున్న డా. బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతి, కళాశాల్లో ఇంటర్మీడియట్ అడ్మిషన్ కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు జరిగిన ఐదవ తరగతి ప్రవేశ పరీక్షకు 10,041 మందికి గాను 9099 మంది విద్యార్థులు హాజరయ్యారు. 942 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుండి 4:30 గంటల వరకు జరిగిన ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షకు 4228 మందికి గాను 3583 మంది హాజరయ్యారు. 647 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద మెడికల్ సిబ్బంది మందులతో అందుబాటులో ఉన్నారు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు, తదితర వసతులు ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. మాస్ కాఫీయింగ్ జరగకుండా ఆయా మండల ఎంఆర్‌ఒలు, డిటిలు సిట్టింగ్ స్క్వాడ్స్‌గా వ్యవహరించారు. డిసిఒ ఎన్.బాలజీ నాయక్ తిమ్మాపూరం, మరికొన్ని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరగడానికి సహకరించిన అన్ని శాఖల అధికారులకు, ఉద్యోగులకు డీసీవో కృతజ్ఞతలు తెలియజేశారు.



నిరసన తెలుపుతున్న ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ సభ్యులు

జీవో 52ను ఉపసంహరించుకునే వరకు పోరాటం

గాంధీ, అంబేద్కర్ విగ్రహాల వద్ద ఎఐబిఎస్ఎస్ నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బోయ, వాల్మీకి, బెంతో, ఒరియా కులాల వారిని ఎస్టీ జాబితాలో చేర్చేందుకు వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన 52 జీవో ఉపసంహరించుకునేంత వరకు గిరిజనులు ఐక్యంగా పోరాటాలు చేస్తారని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా గౌరవాధ్యక్షులు సి.అశ్వర్థ నాయక్ అన్నారు. ఆదివారం ఎఐబిఎస్-ఎస్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహించారు. టవర్ క్లాక్ నుంచి చేపట్టిన ర్యాలీని అశ్వర్థ నాయక్ ప్రారంభించారు. మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి సప్తగిరి సర్కిల్ మీదుగా జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఐబిఎస్ఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు అశ్వర్థ నాయక్ మాట్లాడుతూ గిరిజనుల పక్షపాతి ప్రభుత్వం అని చెబుతూనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరో వందేళ్లు గిరిజనులను వెనక్కి నెట్టేలా ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేరుస్తున్నారని విమర్శించారు. అన్ని విధాలుగా అభివృద్ధి చెందిన బోయ, వాల్మీకి, బెంతో వరియాలను ఎస్టీ జాబితాలో చేర్చి తమ పిల్లల భవిష్యత్తును నాశనం చేయడం సరికాదన్నారు. వాల్మీకి బోయల మీద ప్రభుత్వానికి నిజంగా ప్రేమ ఉంటే వారికి ప్రత్యేక రిజర్వేషన్ కల్పించి, ప్రత్యేక నిధులను కేటాయించి అభివృద్ధి చేస్తే మంచిదే అన్నారు. దీనిని గిరిజనులు కూడా స్వాగతిస్తారని తెలిపారు. అలా కాదని వారిని ఎస్టీ జాబితాలో చేరుస్తామంటే తాము ఒప్పుకునేది లేదన్నారు. 33 ఉప కులాలు ఉన్న ఎస్టీ రిజర్వేషన్‌లో దామాషా ప్రకారం రిజర్వేషన్ పెంచాలని తాము అడుగుతున్న తరుణంలో ఇతరులను చేర్చి తమకు అన్యాయం చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. గిరిజనులకు ఇంత అన్యాయం జరుగుతున్నా మాట్లాడటానికి ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. అన్ని విధాలుగా వెనుకబడిన గిరిజనులు ఇప్పుడిప్పుడే అభివృద్ధి ఫలాలను అందుకుంటున్నారన్నారు. ఇలాంటి తరుణంలో ఏకపక్షంగా ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చి గిరిజనుల అభివృద్ధిని అడ్డుకోవడం అన్యాయం అన్నారు. సంక్షేమం, హక్కుల కోసం ఏనాడూ గిరిజనులు ఇలా రోడ్లెక్కిన పరిస్థితి రాలేదన్నారు. తమకు రక్షణగా ఉన్న ఏకైక ఎస్టీ రిజర్వేషన్‌లో ఇతరులను చేర్చి నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తుండట ఆందోళనకరంగా ఉందన్నారు. సిఎం జగన్‌మోహన్ రెడ్డి పునరాలోచించాలన్నారు. నిజంగా గిరిజనులు ఆ పార్టీకి కావాలనుకుంటే తక్షణమే 52 జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. శాంతియుత పోరాటాలతో ప్రభుత్వం దిగిరాకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అల్ ఇండియా బంజారా సేవా సంఘ్ అనంతపురం జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ గౌరవ సలహాదారులు హెచ్.శేఖర్ నాయక్, ఉపాధ్యక్షులు ప్రసాద్ నాయక్, కిరణ్‌కుమార్ నాయక్, వెంకట నాయక్, ధర్మసింగ్ నాయక్, నగర సభ్యులు కుమార్ నాయక్, మహిళా అధ్యక్షురాలు సుగుణ బాయి, చంద్రీబాయి, మహిళా సభ్యులు ఈశ్వరి బాయి, రచయిత ఎస్ఎన్.కృష్ణా నాయక్, కమిటీ సభ్యులు నరేష్ నాయక్, పిక్లా నాయక్, నారాయణ నాయక్, చాంప్లా నాయక్, సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీనరేజ్ రుసుము తప్పనిసరి

ప్రజాశక్తి-అనంతపురం

తరతరాలుగా పకృతి సంపద దోపిడీకి గురవుతోంది. ప్రభుత్వాలు మారుతున్నా, చట్టాలు ఉన్నా, అధికారుల అండతో, పలుకుబడితో కొందరు ప్రకృతిని కొల్లగొడుతూనే ఉన్నారు. కనిపించని ఈ దందా రూ.కోట్లలో సిరులు అందిస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానం పేరుతో సీనరేజ్ రుసుము బాధ్యతను గుత్తేదారులకు అప్పగించింది. దీనిపై ప్రజల్లో ఉన్న అపోహలను నివృత్తి చేయటానికి గనులు మరియు భూగర్భశాఖ ఉపసంచాలకులు యంపరాల నాగయ్య ప్రజాశక్తికి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : సీనరేజ్ అంటే ఏమిటి? ఎందుకు చెల్లించాలి ?

జవాబు : సీనరేజ్ అంటే పన్ను. ప్రకృతి వనరులను కాపాడుకోవటానికి, విచ్చలవిడి వ్యాపారం, రవాణాకు అడ్డుకట్ట వేయటానికి ప్రభుత్వం నిబంధనలు పెట్టింది. ఈ సీనరేజ్ విధానం చెల్లించిన తరువాతనే తవ్వకాలు, రవాణా జరగాలి. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రతి ఒక్కరూ సీనరేజ్ చెల్లించి రవాణా చేయాలి. ఎవరికీ మినహాయింపు లేదు.

ప్రశ్న : ప్రస్తుతం ఈ విషయంపై పలు అపోహలు వినబడుతున్నాయి. మీరేమంటారు ?

జవాబు : వాస్తవమే. కాని అవి అపోహలు మాత్రమే. ప్రభుత్వ నిబంధనలు అమలు చేయల్సిన బాధ్యత అధికారులకు ఉంటుంది. నిబంధనలను కఠినతరం చేయటం వల్ల ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రశ్న : గనులు, భూగర్భ శాఖ నుండి సీనరేజ్ బాధ్యత ప్రయివేటు వారికి అప్పగించారా ?

జవాబు : అవును..2023 మార్చి 3వ తేది నుండి అమిగోస్ మినరల్స్ సంస్థ మట్టి, మినరల్స్ సీనరేజ్ రుసుము బాధ్యతలను ఈ-టెండరు ద్వారా దక్కించుకుంది. అప్పటి నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం గనులు, భూగర్భ శాఖతో కలిసి ఆ సంస్థ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అడ్డుకుంటోంది. ముఖ్యంగా ఈ సంస్థ మట్టి, మినరల్స్‌ను సీనరేజ్ లేకుండా రవాణా చేయనివ్వదు.

నూతన విధానం వల్ల రూ.4 కోట్ల ఆదాయం
గనులు, భూగర్భశాఖ ఉపసంచాలకులు యంపరాల నాగయ్య



ప్రశ్న : ప్రయివేటు సంస్థకు ఎప్పటి వరకు బాధ్యులు ఇచ్చారు ?

జవాబు : రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి చిన్న తరహా ఖనిజాల సీనరేజ్ వసూళ్ల కాంట్రాక్టును ఈ-యాక్షన్ ద్వారా అమిగోస్ మినరల్స్ సంస్థకు రెండు సంవత్సరాల కాలపరిమితికి గాను కాంట్రాక్టు ఇచ్చింది. కాంట్రాక్టరు రుసుముగా సుమారు రూ.259 కోట్లు నిర్ధారించింది. ఈ క్రమంలో ప్రతి నెలా కాంట్రక్టరు రూ.10,79,58,333 కోట్లు ముందుగా రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలి.

ప్రశ్న : నూతన విధానం వల్ల ప్రయోజనం ఉందా ?

జవాబు : ఈ విధానంతో ప్రభుత్వానికి ప్రతి నెలా అక్షరాల రూ.3.99 కోట్లు ఆదాయం వస్తోంది. గతంతో పోల్చితే కారణాలు ఏమైనా ప్రకృతి సపదను కొల్లగొట్టేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు ఉండవు. దీంతో అక్రమంగా తరలించే అవకాశాలు పూర్తిగా మూసుకుపోవటంతో ప్రకృతి సంపదను కాపాడుకోవచ్చు.

ప్రశ్న : గుత్తేదారులు ఎలాంటి పనులు చేయాలి ?

జవాబు : అక్రమ రవాణాను అదుపు చేసేందుకు ప్రభుత్వ ఆదాయాన్ని పక్కదారి పట్టనీయకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి గనులు, భూగర్భ శాఖ గుర్తింపు పొందిన ప్రయివేటు సిబ్బందిని నియమించుకుని ఖనిజ రవాణా వాహనాలను తనిఖీ చేయాలి. మట్టి, కంకర వంటి మినరల్స్ సీనరేజ్ చెల్లించకుంటే కట్టించాలి. లేకుండా రవాణా చేస్తే వాహనాలను ఆపి అధికారుల దృష్టికి తీసుకురావాలి.

ప్రశ్న : సీనరేజ్‌ను పెంచటంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. దీనికి మీ సమాధానం ?

జవాబు : రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు కాంట్రాక్టరుకు బాధ్యతలను అప్పగించినా గతంలో ఉన్న సీనరేజ్ రుసుము ఒక్క రూపాయి కూడా పెంచలేదు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్ణయించిన సీనరేజ్ రుసుమును మాత్రమే గుత్తేదారులు వసూలు చేయాలి. అదనంగా ఎలాంటి డబ్బు వసూలు చేయకూడదు. తదుపరి చర్యలు తీసుకునే బాధ్యత కూడా ప్రభుత్వ అధికారులకు మాత్రమే ఉంటుంది. గుత్తేదారులు పరిశీలకులుగా ఉంటారు. సమస్యలు వచ్చినప్పుడు అధికారులకు తెలియచేస్తారు. తదుపరి నిర్ణయం మేరకు అపరాధ రుసుము గనులు, భూగర్భ శాఖ అధికారులు నిబంధనల మేరకు నిర్ణయిస్తారు.

ప్రశ్న : ప్రకృతి వనరులకు సీనరేజ్ తప్పని సరిగా చెల్లించాలా ?

జవాబు : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రకృతి.. అందులో భాగమైన భూమిలో దొరికే అన్ని ఖనిజాలకు సీనరేజ్ రుసుమును వసూలు చేస్తారు. గతంలో గనుల శాఖ అధికారులు ఇదే క్రమంలో చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత ప్రయివేటు వారికి అప్పగించిన తరువాత ఇదే అమలవుతోంది. అయితే సిబ్బంది లోటు కారణంగా అక్రమ రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడింది. ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయం కారణంగా ఒక విధంగా ప్రకృతి కాపాడబడడంతో పాటు ప్రభుత్వానికి రాబడి



పెరిగింది.

ప్రశ్న : సీనరేజ్ విషయంలో మినహాయింపులు ఉన్నాయా ?

జవాబు : ప్రభుత్వ విధానం, జీవో 100 నిబంధనల ప్రకారం చట్టం నుండి ఎవ్వరికీ మినహాయింపు లేదు. సీనరేజ్ కట్టిన తరువాతనే ఖనిజం తవ్వకం రవాణా జరగాలి. ప్రభుత్వ సంబంధిత పనులకు, కమర్షియల్ వెంచర్లకు ప్రభుత్వం నిర్ణయించిన సీనరేజ్ చెల్లించాలి. ఏవైనా సీనరేజ్ విషయంలో మినహాయింపులు ఉంటే ఆ పత్రాలను అధికారులకు ముందుగా చూపాలి. నిబంధనలు తప్పనిసరి.


ప్రశ్న : అధికారులపై రాజకీయ ఒత్తిడి ఉందా ?

జవాబు : ఎలాంటి ఒత్తిడి లేదు. అయితే గతం నుండి ప్రకృతి వనరుల విషయంలో ఉదాసీనత ఉన్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఈ విషయంలో అనేక కేసులు పెట్టాం. ప్రస్తుతం నూతన విధానం వల్ల ప్రకృతి వనరులను కొల్లగొట్టకుండా చూడాల్సిన బాధ్యత అధికారులుగా మాపై ఉంది. ఇది సామాజిక బాధ్యత కూడా. అవసరం మేరకే ప్రకృతిని వినియోగించుకోవాలి. వ్యాపారం చేస్తే తప్పకుండా సీనరేజ్ చెల్లించాలి. ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. పాలకుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్తు న్నాం. అందరూ సహకరిస్తున్నారు. సమిష్టిగా, సామాజిక బాధ్యతగా ప్రకృతిని కాపాడుకోవటంతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని పక్కదారి పట్టకుండా చూస్తున్నాం.

సత్యసాయి ఆరాధనోత్సవాలకు బందోబస్తు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సత్యసాయి 12వ ఆరాధన ఉత్సవాలు సోమవారం జరగనున్నాయి. ఆరాధన ఉత్సవాల్లో భాగంగా హిల్ వ్యూ స్టేడియంలో తగిన ఏర్పాట్లను ట్రస్టు చేపట్టింది. స్టేడియంలో 10 గంటలకు భక్తులకు పేదలకు అన్న ప్రసాదములతో పాటు నూతన వస్త్రాలు పంపిణీ చేయనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లను సత్యసాయి ట్రస్టు ప్రతినిధులతో పాటు డీఎస్పీ యశ్వంత్ పరిశీలించారు. కరోనా కారణంగా గత నాలుగేళ్లుగా ఆరాధన ఉత్సవాలు జరగలేదు. పుట్టపర్తి పరిసర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు ప్రజలు పాల్గొననున్నారు. సాయి కుల్వంత్ హాల్లో వేద పఠనం ట్రస్టు ప్రతినిధులు ప్రసంగం, భజనలు 10 గంటలకు ముగియగానే స్టేడియంలో ప్రసాదాలు, వస్త్రాలు పంపిణీ ఉంటుందన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఎస్పీ, ఇద్దరూ సిఐలు, ఏడుగురు ఎస్ఐలు, 22 మంది హోంగార్డులు, 400 మంది కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.




బందోబస్తుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులు

బాగేపల్లి న్యూస్ ...

సిపిఎం ప్రచారానికి చిన్నారి హుండీ విరాళం

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఎక్కడైనా తాము గెలవాలని ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు డబ్బులు పంచడం చూసుంటాం. కాని అభ్యర్థులకే డబ్బులు ఇచ్చి మీరు గెలవాలని కాంక్షించే వారిని ఇప్పుడు చూస్తున్నాం. కర్నాటక ఎన్నికలలో భాగంగా బాగేపల్లి అసెంబ్లీలో సిపిఐ(ఎం) అభ్యర్థిగా డాక్టర్ అనీల్‌కుమార్ బరిలో ఉన్నారు. ఈ మేరకు ఆయన తన ప్రచారంలో భాగంగా పాతపాళ్యం హెబ్లీ నారేముద్దేపల్లి గ్రామపంచాయతీ కేంద్రానికి ఆదివారం వెళ్లాడు. అక్కడ చిన్నారి నాజియా తాను రూపాయి రూపాయి కూడబెట్టుకున్న హుండీని అభ్యర్థికి విరాళంగా ఇచ్చింది. ప్రచారానికి ఉపయోగించుకోండి సార్ అంటూ ముద్దుముద్దుగా చెప్పింది. చిన్నారి హుందాతనానికి ఫిదా అయిన అభ్యర్థి చిన్నారికి కరచాలనం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారి తల్లి సాహీనా భాను కుటుంబం ముందునుండి కమ్యునిస్టు పార్టీ అభిమానులు. ఇలాంటి అరుదైన గౌరవం కేవలం కమ్యునిస్టు పార్టీ అభ్యర్థులకే దక్కుతుందని పలువురి సోషల్ మీడియా వేదికగా ప్రశంసిస్తున్నారు.



సిపిఎం అభ్యర్థికి తల్లిద్వారా విరాళం అందజేస్తున్న చిన్నారి

ఎస్సీ రిజర్వేషన్ నియోజకవర్గంలో ఇతరుల పెత్తనం

దళిత నాయకులను చెప్పుచేతల్లో పెట్టుకునే ప్రయత్నం
విభేదించిన నాయకులపై ఆరోపణలు, బెదిరింపులు
నాయకుల మధ్య నెలకొన్న బేధాభిప్రాయాలు



ప్రజాశక్తి - మడకశిర రూరల్

మడకశిరలో టిడిపిలో వర్గవిభేదాలు భగ్గుమంటున్నాయి. మాజీ ఎమ్మెల్యే ఈరన్నకు మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి మధ్య విభేదాలు తారస్థాయికి చేరడంతో టిడిపి నాయకులు కార్యకర్తలు పరిస్థితి అయోమయం పడింది.

మడకశిరలో దళితులను ఎదగనివ్వడం లేదని నమ్మి టిడిపి పార్టీలోకి ఆహ్వానిస్తే మాజీ ఎమ్మెల్సీ దళితులను తొక్కేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆరోపిస్తున్నారు. మడకశిర పట్టణంలోనే ఇటీవల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న తన ఆవేదన వెల్లగక్కాడు. అయితే చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. టిడిపికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రకాష్, మాజీ ఎంపిపి అరుణ ఆదినారాయణ, నాయకులు గౌరీపురం అంజి, మెలవాయి శివ, అశ్వత్ రామప్ప తదితరులు మాజీ ఎమ్మెల్సీ పెత్తనంపై తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ముందు నుండి ఉన్న టిడిపి నాయకులను అణుగు తొక్కుతూ మాజీ ఎమ్మెల్సీ పెత్తనం చలాయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దళితులను చెప్పుచేతులో పెట్టుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. అంతేకాకుండా వైసిపిలో ఎంపీ టికెట్ ఇస్తే రావడానికి మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి సిద్ధంగా ఉన్నారని ఇటీవల వైసీపీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఓ సమావేశంలో చెప్పారని గుర్తు చేస్తున్నారు. ఆ వీడియో కాస్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోందని చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్సీకి సంపాదన పోకుండా ఉండాలంటే తన చెప్పు చేతుల్లో ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థిని గుర్తించి గెలిపించుకోవాలని కుట్ర పన్నుతున్నారని ఆరోపిస్తున్నారు. నిజమైన దళిత నాయకులు, బిసి వర్గానికి చెందిన నాయకులు ఇక్కడ అభివృద్ధి చెందాలని పనిచేస్తే తమ మద్దతు ఉంటుందని వారు చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్సీ ఇంటిని మాజీ ఎమ్మెల్యే ఇంటిని ఇన్‌కం ట్యాక్స్ అధికారులు దాడులు నిర్వహించాలని అప్పుడు ఎవరు అవినీతి పరులో తేలి పోతుందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ, ప్రస్తుత ఎమ్మెల్యే తో కుమ్మక్కు కాకపోతే మాజీ ఎమ్మెల్సీ టిప్పర్లు రోడ్డుపై ఎలా తిరుగుతున్నాయని, వారి తమ్ముళ్ల కాంట్రాక్ట్ పనులు ఎలా సాగుతున్నాయని ఆయన అనుచరుల క్వారీలు ఎలా నడుస్తున్నాయని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా టిడిపి నాయకులు ఇళ్ల దగ్గరకి గడపగడప కార్యక్రమంలో నాయకులు వెళ్లలేదని అయితే ఇక్కడ మడకశిరలో మాజీ ఎమ్మెల్సీని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే కలిసి 45 నిమిషాల మాట్లాడిన పరిస్థితి ఉందని అన్నారు. ఆ ఇద్దరు కలిసిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని అన్నారు.

ముందు నుండి నమ్మిన వారిని ముంచి వస్తున్న నాయకుడు ఎవరో అందరికీ తెలుసు అని అన్నారు. 2004 నుండి మాజీ ఎమ్మెల్యే ఈరన్న టిడిపి కోసం నిరంతరం పనిచేస్తూ మచ్చ లేని నాయకుడిగా పేరు సంపాదించుకున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ టిడిపిలోకి రావడం వల్ల టిడిపికి జరిగిన మేలు ఏదీ లేదని ఆయన రాకతో కొంతమంది సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు పార్టీ మారారని అన్నారు. అయితే తిరిగి వారు పార్టీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆధ్వర్యంలో పార్టీ తిరిగి బలపడుతుందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ అనుచరులు నోరు అదుపులో లేకుండా ఒక దళిత నాయకుడిని కించపరిచే విధంగా వెన్నుపోటు దారుడు అని ముద్ర వేయడం సిగ్గుచేటుగా ఉందన్నారు. అసలైన వెన్నుపోటుదారుడు ఎవరన్న సంగతి అందరికీ తెలుసని అన్నారు.

దళితులను ఏమాత్రం ఇవ్వకుండా ఎదగనివ్వకుండా ఎస్సీ రిజర్వేషన్ ఉన్న నియోజకవర్గంలో ఎస్సీలను తొక్కేసి పెత్తనం చెలాయిస్తున్న విషయాన్ని నియోజకవర్గంలోన దళితులు, ఇతరులు గమనిస్తున్నారని అన్నారు. దళిత నాయకుల మధ్య చిచ్చుపెట్టి తన పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే టిడిపిలో ఎమ్మెల్యే అభ్యర్థుల కోసం 12 మంది బయోడేటాను అధిష్టానానికి పంపారన్నారు. ఆ12 మంది అభ్యర్థులను మాజీ ఎమ్మెల్సీ తన చెప్పుచేతుల్లో ఉంచుకుని తన పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. అయితే ఆ 12 మందిలో అభ్యర్థుల్లో ఎవరికి తన పూర్తి మద్దతు అని మాజీ ఎమ్మెల్సీ ఇప్పటికీ చెప్పలేదని అందరికీ టికెట్ ఆశ చూపి వెంట తిప్పుకుంటున్నారన్నారని ఆరోపిస్తున్నారు. ఆయన పెత్తనం భరించలేక మాజీ ఎమ్మెల్యే ఈరన్న బయటకు వస్తే ఆయనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ బెదిరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఒక దళిత నాయకుడిని కించపరిచే విధంగా అనుచరులతో మాట్లాడిస్తే ఊరుకునేది లేదని ఘాటుగా సమాధానం చెప్పాల్సి వస్తుందని ఈ సందర్భంగా నాయకులు హెచ్చరిస్తున్నారు. అయితే తెలుగుదేశం పార్టీ అభివృద్ధి చెందడానికి చంద్రబాబు నాయుడుని సీఎం చేయడానికి టిడిపిలో విభేదాలు లేకుండా కలిసి వస్తే కలిసికట్టుగా పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్యే ఈరన్న చెబుతుండటంతో ఆయన మంచితనానికి నిదర్శనమన్నారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో వ్యక్తి మృతి

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన గొర్ల సూర్యనారాయణ (35) ప్రమాదవశాత్తు మృతి గ్రామానికి చెందిన సూర్యనారాయణ గత కొంతకాలం నుండి వరికోత యంత్రానికి డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. వరికోతల కోసం చెన్నే కొత్తపల్లి మండలం కోనకు వెళ్లగా అక్కడ ఆదివారం ఉదయం పనులకు వెళ్తున్న సమయంలో వరికోత యంత్రం ప్రమాదానికి గురైంది. ఆ యంత్రం కింద పడిన సూర్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి చేసి జీవనం సాగించే కుటుంబ పెద్ద మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. మృతునికుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు బంధువులు కోరుతున్నారు.

మద్యం దుకాణంలో నైట్ వాచ్‌మెన్‌పై దాడి

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ లో గల మద్యం దుకాణంలో పనిచేస్తున్న రామాంజనేయులు అనే నైట్ వాచ్ మెన్‌పై నలుగురు వ్యక్తులు శనివారం రాత్రి దాడి చేశారు. ఈ మేరకు నలుగురు వ్యక్తులు తనను చితకబాదినట్లు బాధితుడు సోమందేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ప్రభుత్వ మద్యం దుకాణం లో పనిచేస్తున్న సిబ్బంది చొరవ మేరకు కొందరు బయట వ్యక్తులు ప్రభుత్వ మద్యం దుకాణంలో కూర్చుని మద్యం తాగుతుండగా నైట్‌వాచ్‌మెన్ అభ్యంతరం తెలిపాడు. దీంతో వారికి నైట్‌వాచ్‌మెన్‌కు మధ్య మాటామాటా పెరిగింది. దీంతో బయట వ్యక్తి మరో ముగ్గురిని వారి బంధువులను పిలిపించుకొని నైట్ వాచ్‌మెన్‌ను చితకబాదారు. ఈ విషయంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దాడిలో గాయపడిన వారికి ఆర్థిక సాయం

నల్లమాడ : అగ్రవర్ణాల దాడిలో గాయపడి కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వడ్డెర్లను ఉమ్మడి అనంతపురం జిల్లా వడ్డెర సంఘం నాయకులు ఆదివారం కదిరికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. వడ్డెర కుల సంఘం జిల్లా నాయకులు జెరిపిటి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈ సాయం చేశారు. రెండు రోజుల క్రితం నల్లమాడ మండల పరిధిలోని సి.ఐడమాండ్లపల్లిలో అగ్రవర్ణాల వారికి వడ్డెర్లకు మధ్య ఘర్షణ జరిగింది. ఈ దాడులలో గాయపడిన కుంచపు లక్ష్మీదేవి ,ఈమె కుమార్తెలు విజయలక్ష్మి, రాణికి అనంతపురానికి చెందిన వడ్డె దలవాయి కుటుంబ సభ్యులు, దలవాయి వెంకటనారాయణ, వడ్డె సిమెంట్ పోలన్న, పెద్ద మారెప్ప పదివేల రూపాయల ఆర్థిక సాయాన్నందజేశారు .ఈ కార్యక్రమంలో సత్య సాయి జిల్లా వడ్డెర సంఘం నాయకులు గోగుల చక్రపాణి, మారెప్ప, ఉత్తన్న, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

బత్తలపల్లి : అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి ముందు ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. అనంతపురం రూరల్ మండల పరిధిలోని చియ్యేడు గ్రామానికి చెందిన ఆదినారాయణ, వెంకటలక్ష్మీ దంపతులు ద్విచక్ర వాహనంపై ముదిగుబ్బ మండలంలోని ముక్తాపురం గ్రామానికి వెళ్లి తిరుగు పయనమయ్యారు. వీరు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి ముందు వెళుతుండగా కదిరి వైపు నుండి బత్తలపల్లి వైపు వస్తున్న కారు వేగంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసపత్రికి తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోయింది. బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫోర్జరీ కేసులో ముగ్గురు నిందితులు అరెస్టు

హిందూపురం : ఓ వృద్ధుడి కొడుకు, కూతురు బెంగళూరు, హైదరాబాదులో ఉన్నారని తెలుసుకున్న ముగ్గురు దుండగులు ఆ వృద్ధుడి పేరుతో వీలునామా రాసినట్లు పత్రాలను సృష్టించి, అతని పేరిట ఉన్న కోట్లాది రూపాయల ఆస్తులను కాజేయడానికి ప్రయత్నించి స్థానిక టూటౌన్ పోలీసులకు పట్టుబట్టారు. అందుకు సంబంధించిన వివరాలు... పట్టణంలోని మెయిన్ బజారులో వెంకటరమణయ్య అనే వృద్ధుడు నివాసం ఉంటున్నాడు. అతనికి పోచనపల్లికి చెందిన బలిజ శ్రీనివాసులు చాలా ఏళ్లుగా పాలు సరఫరా చేస్తు సన్నిహితుడుగా మారాడు. వెంకటరమణయ్య కుమారుడు గంగాధర్ బెంగళూరులోను, కుతురు శాంత హైదరాబాదులో నివాసం ఉంటున్నట్లు శ్రీనివాసులు తెలుసుకున్నాడు. వృద్ధుడి పేరిట ఉన్న కోట్లాది రూపాయాల ఆస్తిని ఎలాగైన కాజేయాలని పథకం రచించాడు. ఆ వృద్ధుడు తన పేరుమీద వీలునామ రాసినట్లు శ్రీనివాసులు ఫోర్జరీ పత్రాలను సృష్టించాడు. ఫోర్జరీ పత్రాల ద్వారా ఆస్తిలో ఉన్న పాండురంగనగర్‌లోని విలువవైన 17సెంట్ల స్థలాన్ని పట్టణంలోని కెఎల్ రోడ్డులో హెూమియోపతి క్లీనిక్ నడుపుతున్న జయచంద్ర రెడ్డి పేరిట 2014లో చిలమత్తూరు రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్టర్ చేశాడు. కర్నాటక రాష్ట్రంలోని పావగడ తాలూకా అప్పనపల్లి చెందిన తన బంధువు ముత్యాలప్ప ఆధార్ కార్డు మార్పు చేసి గంగాధర్ అని సృష్టించారు. ఆస్తి రిజిస్టర్ చేసే సమయంలో వృద్ధుడి కుమారుడైన గంగాధర్ సంతకం చేసినట్లు ముత్యాలప్పతో సంతకం చేయించాడు. ముగ్గురు కలిసి ఆస్తిని కాజేయాడానికి హిందూపురంలో కాకుండా చిలమత్తూరు రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్టర్ చేశారు. తమ ఆస్తిని అక్రమంగా కాజేసినట్లు వెంకట్రమణయ్య కుమారుడు గంగాధర్ గుర్తించి రెండవ స్టేషనలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పూర్తి విచారణ చేపట్టారు. నిందితులైన శ్రీనివాసులు, జయచంద్రారెడ్డి, ముత్యాలప్పను పోలీసులు అదివారం పట్టణంలోని సూగూరు క్రాస్ వద్ద అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలిచింనట్లు సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి పరీక్షలు

లేపాక్షి: మండలం పరిధిలోని నాయనిపల్లి క్రాస్ లో ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మీడియట్ ప్రవేశం కోసం ఆదివారం పరీక్షలు నిర్వహించారు. 5 వ తరగతి లో చేరుటకు 413మంది దరఖాస్తు చేసుకొనగా పరీక్షలకు 372మంది విద్యార్థులు హాజరయ్యారు. అదేవిధంగా ఇంటర్‌మీడియట్ చేరడానికి 127మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షలకు 99మంది హాజరయ్యారని ప్రిన్సిపల్ మైలారప్ప తెలిపారు. త్వరలోనే ఫలితాలను ప్రకటించి మెరిట్ లిస్టు ఆధారంగా అడ్మిషన్స్ జరుపుతామని చెప్పారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కదిరి అర్బన్ : పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాల ఆవరణంలో వజ్ర ఫౌండేషన్ అధినేత వజ్ర భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని వజ్ర భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఆపరేషన్ల కోసం బెంగళూరు వెళుతున్న వారికి ఉచితంగా భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందంతో పాటు వజ్ర ఫౌండేషన్ సిబ్బంది ఈశ్వర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, సయ్యద్, బావాజీ, రమేష్ నాయుడు, హరీష్ నాయక్, సురేష్, విజయ్, గిరి, ఈశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం కౌలేపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త గంగాద్రి కుమార్తె అంబిక(9) శనివారం విద్యుత్ ఘాతానికి గురైంది. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జికందికుంట వెంకటప్రసాద్ బాధిత కుటుంబసభ్యులను ఫోన్లో పరామర్శించారు. బాధితులకు 40 వేల రూపాయలును తెలుగుదేశం పార్టీ నాయకుల ద్వారా అందజేశారు. ఈ మేరకు నాయకులు బంగారు క్రిష్ణమూర్తి, కౌలేపల్లి చంద్ర, గణేశ్, సురేష్‌ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం కొటిపి గ్రామంలో రామకృష్ణారెడ్డి ఫౌండేషన్ తరపున పట్టణంలోని నారాయణ హృదయాలయ సౌజన్యంతో అదివారం 61వ ఉచిత వైద్య శిబిరాన్ని వైద్యులు నరసింహా రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు గుండె జబ్బులు, బీపీ, షుగరు, థైరాయిడ్, సాధారణ రోగులను పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా పంపిణీ చేశారు.

'మిషన్ వాత్సల్య'పై అవగాహన

ధర్మవరం టౌన్ : అనాథలు, తల్లి లేదా తండ్రి లేని పిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'మిషన్ వాత్సల్య' పథకంపై పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆదేశాల మేరకు ఆదివారం 28వ వార్డులో మిషన్ వాత్సల్య పథకంపై నాయకులు ప్రజలకు వివరించి పథకానికి సంబంధించిన దరఖాస్తులను అందజేశారు. ఈ పథకం ద్వారా అనాథ పిల్లలకు, తల్లి లేదా తండ్రి లేని, విడాకులు తీసుకున్న మహిళల పిల్లలకు 18 సంవత్సరాల వరకూ నెలకు రూ.4వేల చొప్పున అందజేస్తారన్నారు. ఇద్దరు పిల్లలుంటే నెలకు రూ.8వేలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంధమనేని నారాయణస్వామి, తలారి గణేశ్, సయ్యద్, బాబాయ్య, నబి రసూల్, శ్రీనివాసులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ధర్మవరం టౌన్ : అక్షయ తృతీయ సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో గాయత్రీ పరివార్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంఘం, యుగ పరివర్తన మిషన్ అండ్ మిత్రబృందం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వన్ టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం హాజరై మాట్లాడుతూ వేసవిలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అలాగే మజ్జిగ పంపిణీ చేసిన సంఘాల సభ్యులను అభినందించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు 5,000 మందికి మజ్జిగ పంపిణీ చేయడం ఎంతో సంతోషం కలిగించిందని తెలిపారు.

ప్రభుత్వాస్పత్రి వద్ద అన్నదానం

ధర్మవరం టౌన్ : తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద టీడీపీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వాస్పత్రి వద్ద పేదలకు మధ్యాహ్నం 12 గంటలకు అన్నా క్యాంటీన్ ద్వారా అన్నదానం చేస్తామన్నారు. పట్టణంలో సోమవారం వారపు సంత కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పట్టణాకి వచ్చే వారికి అన్నదాన కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉందాం

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని ఎస్‌డీఆర్ కళాశాల విద్యార్థులు ఆదివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గుంజేపల్లి గ్రామంలో చెడు వ్యసనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి మద్యం, గంజాయి, పొగాకు, తదితర చెడు వ్యసనాలకు గురికావద్దని, వాటి వల్ల తలెత్తే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. అలాగే ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గుంజేపల్లి సర్పంచ్ సంధ్యలక్ష్మి, శివ శంకర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ తారకేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీఓ సురేష్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు

ఉచిత కంటి వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం

ధర్మవరం టౌన్ : పేదల కోసం ప్రతి నెలా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని వన్ టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు పిట్టా వెంకటస్వామి, కార్యదర్శి గూడూరు మోహన్ దాస్, సభ్యులు గోసే రాధాకృష్ణ, గవ్వల రాధాకృష్ణ, శిబిరం దాత చెన్నం శెట్టి జగదీశ్, పీఈటీ రమేశ్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాలకు తల్లిదండ్రులను పంపొద్దు

ప్రజాశక్తి - మడకశిర

నేటి సమాజంలో విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించినప్పటికీ తల్లిదండ్రులని వృద్ధాశ్రమలకు పంపించడం బాధాకరమని దీనిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో గురువులు హితబోధ చేశారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో 1973 నుండి 1980 వరకు 6 నుండి 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమలో అప్పటి గురువులు జార్జిపల్, ఓబుల రెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి రఘువీరారెడ్డి, రిటైర్డ్ జడ్జ్ శివశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ నేడు ఉన్నత చదువులతో ఉన్నత స్థానాలకు చేరుకోగలిగినప్పటికీ సమాజంలో తల్లిదండ్రులని వద్ధాశ్రమలవైపు పంపిస్తున్న వైనం ఎంతో బాధాకరమైన విషయం అని అన్నారు. ఆదర్శంగా ఉంటూ తల్లిదండ్రులని అటువైపు పంపించకుండా స్ఫూర్తిదాయకంగా ఉండాలని ఈ సందర్భంగా అప్పటి తమ శిష్యులకు హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ రఘునాథ్, పూర్వ విద్యార్థి బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ నరసింహ స్వామి, సింగరేణి కాలరీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ గోవిందప్ప, బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ డిఇ రాజశేఖర్ రెడ్డి. మధుసూదన్, స్థానిక నేతలు పూర్వ విద్యార్థులైన పురుషోత్తం, రవిశేఖర్ రెడ్డి, ఆనంద రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



వైసిపి ప్రభుత్వానికి సెల్ఫీ చాలెంజ్ చేస్తున్న సవితమ్మ

వైసిపి ప్రభుత్వానికి సవితమ్మ సెల్ఫీ చాలెంజ్


ప్రజాశక్తి -పెనుకొండ

మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం అతి వేగంగా పూర్తి చేసి కృష్ణ జలాలను గొల్లపల్లి రిజర్వాయర్‌లో నింపి పెనుకొండ నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యను, హిందూపురానికి తాగునీటి సమస్యను తీర్చిన ఘనత చంద్రబాబు నాయుడుదే అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ అన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం గొల్లపల్లి వద్ద పార్టీ నాయకులతో కలసి వైసిపి ప్రభుత్వానకి సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. హిందూపురానికి తాగు నీటి కోసం రూ 190 కోట్లతో ఇక్కడి నుండే పంపింగ్ చేస్తున్నారన్నారు. అదేవిధంగాగా పెనుకొండ పట్టణంలో తాగునీటి అవసరాలకు రూ. 10 కోట్లతో పథకం అమలు చేశామన్నారు. ఇంకా అనేక చెరువులను మొదటిసారి కృష్ణ జలాలను నింపిన చరిత్ర గత తెలుగుదేశం ప్రభుత్వానిది అని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఇరిగేషన్ ప్రాజెక్టులను రిజర్వాయర్లను పూర్తిగా గాలికి వదిలేసారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబుల్ రెడ్డి, త్రివేంద్ర నాయుడు, మావటూరు గోపాల్, వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన వసతి సముదాయం ప్రారంభం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి శ్రీవారి భక్తుల సౌకర్యార్థం మరో నూతన సముదాయాన్ని దేవాదాయ శాఖ అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. కదిరి పట్టణంలోని శ్రీమద్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానమునకు సంబందించి గతంలో ఉన్న శ్రీ చలపతినాయుని సత్రాన్ని అన్ని హంగులతో ఏర్పాటు చేసిన (శ్రీ అమత వళ్ళి సదన్) నూతన వసతి సముదాయాన్ని ఎమ్మెల్యే సిద్దారెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం వసతి సౌకార్యములలో భాగంగా దేవస్థానం నిధులతో 32 వసతి గదులను అధునాతన హంగులతో నిర్మించి అందుబాటులోనికి తీసుకొని వచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ , ఆలయ కమిటీ ఛైర్మెన్ జెరిపిటి గోపాల క్రిష్ణ, ఎడి.పార్థసారథి చార్యులు, ప్రధాన అర్చకులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనర్, ఎస్.సతీష్, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శ్రీనివాస్ ప్రసాద్ , అంజన్ కుమార్ చార్యులు ముఖ్య అర్చకులు, ఆలయ పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

బసవన్న జీవితం ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న కొండురు మల్లికార్జున

ప్రజాశక్తి-హిందూపురం

ఆధునిక కాలంలో ఆచరిస్తున్న పద్దతులను 12వ శతబ్దంలోనే ఆచరించిన బసవన్న జీవితం అందరికి ఆదర్శమని వీరశైవ సంఘం నాయకులు కొండురు మల్లికార్జున అన్నారు. అదివారం పట్టణంలోని చిన్న మార్కెట్‌లో ఉన్న బసప్ప చౌటరిలో బసవన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొండురు మల్లికార్జున మాట్లాడుతు వీరశైవ సంఘంకళ్యాణమండపం నిర్మాణం, బసవన్న విగ్రహం ఏర్పాటు, ఆర్థికంగా వెనుకబడిన కులస్తులకు రూ.50 పైసలకే రుణాలు ఇప్పించే ప్రయత్నం చేస్తామని ప్రకటించారు. హిందూపురంలో శ్రీ బసవేశ్వర విగ్రహం ఏర్పాటుకు రూ. 1 లక్ష విరాళం అందిస్తామన్నారు. అదే విధంగా మే 5న లేపాక్షిలో జరగనున్న బసవన్న జయంతి వేడుకలకు రూ.10వేలు అందిస్తానన్నారు. కోన ఆశ్రమం పీఠాధిపతి దత్తానందగిరి స్వామి మాట్లాడుతూ బసవన్న అందించిన సేవలను గుర్తు చేశారు. మరి కొంత మంది మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం బసవన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని ఉత్తర్వులు వెల్లడించిందని అయితే స్థానికంగా జరిగిన వేడుకల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనక పోవడం బాధాకరమని అన్నారు. అనంతరం సాయంత్రం పూల పల్లకి ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వీరభద్రప్ప, ఉమేష్, సంపత్‌తో పాటు పెద్ద ఎత్తున వీరశైవ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

దళిత కాలనీలో నీటి ఎద్దడి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని పాపరెడ్డిపల్లి దళిత కాలనీలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. వారం రోజులుగా నీటి సరఫరా చేసే బోరు పనిచేయకపోవడంతో గ్రామంలోకి నీరు రాలేదని దీంతో సమీప రైతు బోరుబావి నుండి నీటిని తెచ్చుకుంటున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. అదేవిధంగా గ్రామంలో లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన నీటి ట్యాంక్ నిరుపయోగంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి నీటి ట్యాంకర్ ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న 13వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ బాలుర హాకీ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం జట్లు సెమీఫైనల్ చేరాయి. టోర్నీలో భాగంగా మూడవ రోజైన ఆదివారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు.

రాక్షస పాలనను తరిమికొడదాం



ఓడిసిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

రొద్దం : రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షస పాలనను తరిమికొడదామని తెలుగుదేశం నాయకులు అన్నారు. మండలంలోని క్లస్టర్ 1లో ఇదేమి ఖర్మ మనరాష్ట్రానికి అనే కార్యక్రమాన్నిఆదివారం పెద్ద గువ్వలపల్లి లో నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నప్పయ్య, నాగేంద్ర, రవి, వెంకటరముడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు ఓబులదేవరచెరువు మండలం తిప్పేపల్లి పంచాయతీ ఉంట్ల వారి పల్లి లో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల ముసుగులో పేదలపై పన్నుల భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వం అని చెబుతూనే రైతులకు చేసిందేమీ లేదని ఇంతవరకు ఒక్క రైతుకు కూడా రాయితీ కింద వ్యవసాయ పరికరాలు అందజేయలేదని విమర్శించారు. దీనికి తోడు రైతుల నడ్డి విరిగేలా వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగస్తులయితే సకాలంలో వేతనాలు రాక నానా ఇబ్బందులు పడుతున్నారని ఈ అస్తవ్యస్తమైన పాలన చూసి ఎప్పుడు ఎన్నికలు వస్తాయా ఈ వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, మండోజి ఆరిఫ్ ఖాన్, జాకీర్ అహ్మద్, అంజినప్ప , బడిసం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న అరటి పంట..

ముదిగుబ్బ : ముదిగుబ్బ మండలంలో శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో గుంజేపల్లి గ్రామంలో రైతు వీర నారప్పకు రూ. 4 లక్షల పంట నష్టం వాటిల్లింది. ఆయన రెండెకరాల్లో పంట సాగు చేయగా ఈదురుగాలుల ధాటికి అరటి చెట్లు నేలకొరిగాయి. పంట చేతికందే సమయంలో చెట్లు కూలిపోవడంతో రూ. 4 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు, తోటి రైతులు కోరుతున్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు

బత్తలపల్లి : మండల కేంద్రమైన బత్తలపల్లిలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఎంపీ ల్యాడ్స్ కింద నిధులు విడుదల చేయడం ఆనందదాయకమని ఏపీ కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాభివద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో కషి చేస్తున్నారన్నారు. ఆ కోవలోనే ఎంపి కృష్ణయ్య ఎంపీ ల్యాడ్స్ నుంచి కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ. 25 లక్షలు కేటాయించడం హర్షణీయమన్నారు. నిధులు విడుదల చేసిన మంజూరు పత్రాన్ని తనకు అందించడం పట్ల కృష్ణయ్యకు కతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉండాలి : ఎడిఎ

హిందూపురం : డివిజన్ వ్యాప్తంగా అన్ని మండల స్థాయి వ్యవసాయ అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండి, ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతో కూడిన సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు అవసరం మేరకు ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటలో ఉండే విధంగా చూసుకోవాలని డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ అన్నారు. అదివారం స్థానిక డివిజన్ కార్యాలయంలో డివిజన్ వ్యాప్తంగా ఉన్నా అన్ని మండల వ్యవసాయ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను రైతులకు వివరించి, అర్హులైన ప్రతి రైతుకు అందే విధంగా చూడాలన్నారు. ముఖ్యంగా వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం, రైతు భరోసా తదితర పథకాల గురించి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండల వ్యవసాయ అధికారులు ఇమ్రాన్ ఖాన్, విజయభారతి, శ్రీలత, వంశీకృష్ణ, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా

మడకశిర రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు కొండంత భరోసా కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. మడకశిర మండలం బుడ్డయ్యపాళ్యం గ్రామంలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ప్రజాప్రతినిధులు నాయకులతో కలిసి పాల్గొన్నారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న పథకాలను వివరించి బుక్‌లెట్ ను అందించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.